

మహబూబాబాద్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కు

సమస్యల దరువు ఆహ్లాదం కరువు

మహబూబాబాద్ టౌన్, జూన్5 (ఆంధ్రజ్యోతి) : పార్కుల్లో ఆహ్లాదం కరువైంది.. ఆలనాపాలన లేక పచ్చదనం కానరాకుండాపోయింది. మానుకోట పట్టణంలో చిన్నారుల ఆట విడుపు కోసం నిర్మించిన చిల్డ్రన్ పార్కులో వసతులు లేక.. సమస్యలు తాండవిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో రూ.60 లక్షలతో నిర్మించి, అందులో ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. కానీ, పిల్లలు వర్షం వచ్చిన సమయంలో, వేసవి కాలంలో సేద తీరడానికి కనీసం షెడ్డును నిర్మించడం మరిచారు. తాగునీటి కోసం బోరును వేశారు. ప్రధాన రహదారి నుంచి పార్కుకు వెళ్లే దారిలో కంకర లేచి, పిల్లలకు ఇబ్బంది కరంగా మారింది. పాలనా సౌలభ్యం కోసం 2016లో మహబూబాబాద్‌ను జిల్లాగా ప్రకటించారు. అయితే జిల్లా కేంద్రంలో పిల్లలు ఆడుకోవడానికి మంచి పార్కును నిర్మించాలనే సంకల్పంతో నాటి ప్రభుత్వం 2400 గజాల్లో రూ.60 లక్షల వ్యయంతో మహబూబాబాద్ నుంచి ఈదులపూసపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన 200 మీటర్ల దూరంలో టీచర్స్ కాలనీకి వెళ్లే మార్గంలో నిర్మించారు. 2018 జనవరి 6న నాటి ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చేతుల మీదుగా ప్రారంభించారు. చిల్డ్రన్ పార్కులో 25 రకాల ఆట వస్తువులనూ ఏర్పాటు చేశారు. ఉదయం 6.30 గంటల నుంచి 9.30 వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు చిల్డ్రన్ పార్కులో పిల్లలు ఆడుకోవడానికి అనుమతినిస్తారు. వేసవి సెలవులు రావడంతో ప్రతీ రోజు చిన్నపిల్లలు పార్కుకు పెద్దసంఖ్యలో వచ్చి ఆహ్లాదాన్ని పొందుతున్నారు.

చిల్డ్రన్ పార్కులో నీడలేక అవస్థలు..

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కులో వసతులు కరువయ్యాయి. చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు బాగానే ఉన్నప్పటికి అందులో మౌళిక సదుపాయాలు కరువయ్యాయి. వేసవి కాలంలో తీవ్ర ఎండల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు భారీ స్థాయిలో పెరిగిన దరిమిలా పిల్లలు ఆడుకున్నాక సేద తీరడానికి నిలువ నీడ కూడ లేదు. కనీసం షెడ్‌ను కూడా నిర్మించ లేదు. మరోపక్క వర్షాకాలంలో వర్షాలు పడితే పిల్లలు తడవాల్సిందే! పట్టణానికి దూరంగా పార్కు ఉండడంతో త్వరగా ఇంటికి చేరుకునే పరిస్థితి కూడా లేదు. పార్కులో చెట్టు కింద నిలబడదామన్న పెద్ద చెట్లు లేవు. ఇక నీటి కోసం బోర్‌ను మాత్రం వేశారు. తాగునీటి కోసం శుద్ధి చేసిన మిషన్ భగీరథ మంచినీటిని సరఫరా చేసేందుకు నల్లాను ఏర్పాటు చేయలేదు.


మహబూబాబాద్ చిల్డ్రన్ పార్కుకు వెళ్లే రోడ్డుపై తేలిన కంకర

మానుకోట పిల్లల పార్కులో వసతుల లేమి?

- తాగునీరు, మరుగుదొడ్లు, నిలువ నీడలేక అవస్థలు
- పార్కుకు వెళ్లే రహదారిలో తేలిన కంకరతో ఇబ్బందులు

రోడ్డుపై నడువాలంటే కష్టమే..

మహబూబాబాద్-ఈదులపూసపల్లి రహదారి పక్కన టీచర్స్ కాలనీకి వెళ్లే మార్గంలో 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కు దారిలో కంకర తేలి దర్శనమిస్తోంది. చిన్నపిల్లలు, వారిని పార్కుకు తీసుకువెళ్లే తల్లిదండ్రులు, వృద్ధులు ఆ రోడ్డుపై నుంచి నడవాలంటే అష్టకష్టాలు తప్పడం లేదు. తేలిన కంకరపై కాలినడకన వెళ్లే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క తేలిన కంకరపై నుంచి ద్విచక్రవాహనం టైరు స్కిడ్ అయి కిందపడి గాయాలపాలైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. మానుకోట జిల్లా కేంద్రం అభివృద్ధిపై దృష్టిసారిస్తున్నపాలకులు, అధికారులు చిల్డ్రన్ పార్కు అభివృద్ధిని మాత్రం పట్టించుకున్న పాపాన పోవడంలేదని వాపోతున్నారు. చిన్నారుల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కులో మౌళిక వసతులు కల్పించడంతో పాటు ప్రధాన రహదారి నుంచి పార్కు వరకు సీసీ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


మహబూబాబాద్ చిల్డ్రన్ పార్కులో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

పార్కులో వసతులు కల్పించాలి



- మైస శ్రీనివాస్, మానుకోట

మహబూబాబాద్ పట్టణంలో చిన్నారుల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కులో అన్ని వసతులు కల్పించాలి. పార్కు అభివృద్ధిపై అధికారులు, పాలకులు దృష్టిసారించాలి. పార్కుకు వెళ్లే రహదారిపై కంకర తేలడంతో ఆరోడ్డుపై నడుచుకుంటూ వెళ్లాలంటే చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. పార్కుకు వెళ్లే రహదారిపై సీసీ రోడ్డును నిర్మించాలి.


కురవి మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. చిన్నగూడూరు మండలంలోని జయ్యారం, కురవి మండలంలోని నేరడ, సూదనపల్లి గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి నూతన ఆర్వోఆర్ రెవెన్యూ చట్టం 2025అని, ఈ చట్టం ద్వారా సామాన్య ప్రజలు, రైతులకు భూ సమస్యల పరిష్కారంలో సరికొత్తవిధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు. భూ సమస్యలు ఉన్న ప్రతీ ఒక్కరైతు ఈ రెవెన్యూ సదస్సులో తమ సమస్యలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపుతారని చెప్పారు. రెవెన్యూ సదస్సులకు హాజరైన రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు దరఖాస్తు ఫారాలను కూడా అందుబాటులో ఉంచాలని చెప్పారు.


సూరయ్యను అభినందిస్తున్న సుధీర్‌రాంనాథ్ కేకన్

ఇద్దరు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి

- అభినందించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్

మహబూబాబాద్ క్రైం, జూన్5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో ఏఎస్సైలుగా విధులు నిర్వహిస్తున్న ఉల్లిరాముల సూరయ్య, విజయరాజులు ఎస్సైలుగా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన ఇరువురు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సూరయ్య 1989లో ఉమ్మడి జిల్లాలోని నర్సంపేటలో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. 2012లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2018లో ఏఎస్సైగా, 2025లో ఎస్సైగా పదోన్నతి పొందారు. పెద్దవంగర పీఎస్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న విజయ్‌రాజు ఎస్సైగా పదోన్నతి పొందారు.


అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు

కన్నుల పండువగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

సీరోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీశివపార్వతులు, అలివేలు మంగ శ్రీవేంకటేశ్వరస్వామి పద్మావతిల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్థానిక దేవాలయంలో గురువారం 28వ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవంలో భాగంగా అర్చకుడు సంతోష్, వేములవాడ ఆలయ వేదపండితులు శ్రీనివాసశర్మ, శివప్రసాద్‌శర్మ, మురళీశర్మ, జగన్మోహన్ శర్మల వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8.45 గంటలకు శ్రీశివపార్వతుల కల్యాణం, ఉదయం 11.55 గంటలకు అలివేలు మంగ శ్రీవేంకటేశ్వర స్వామి పద్మావతి కల్యాణం కల్యాణం జరిపించారు. అనం తరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కల్యాణ మహోత్సవం అనం తరం హుండీ లెక్కింపులో రూ.56, 790 వచ్చినట్లు దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సమత తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవంలో సీరోలు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కురవి శ్రీవీరభద్రస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ పున్నం చందర్, సమత, మాజీ సర్పంచ్‌లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'కనీస వేతనం అమలు చేయాలి'

తొర్రూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామయ్య అన్నారు. గురువారం తొర్రూరులో టీయూసీఐ మహాసభ తీర్మానాలను ఆమోదించి కార్యవర్గాన్ని ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్రతీ కార్మికునికి కనీసం వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.టీయూసీఐ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం, ఉపాధ్యక్షుడిగా పాడ్య బీకూ, సహాయ కార్యదర్శులుగా కె.సంపత్, వెంకన్న, కోశాధికారి లచ్చయ్యతో పాటు మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకుని నూతన కమిటీతో ప్రమాణం చేయించారు.

వైద్య సేవలు క్షేత్రస్థాయిలో విస్తరించాలి

డీఎంహెచ్‌వో భూక్య రవిరాథోడ్


జిల్లా ప్రధాన ఆస్పత్రిలో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న భూక్య రవిరాథోడ్

మహబూబాబాద్ క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య సేవలను క్షేత్రస్థాయిలో విస్తరించి, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) భూక్య రవిరాథోడ్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ అస్పత్రిలో గురువారం వైద్యసేవలపై వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ నవజాత శిశువుల సంరక్షణ, సంక్రమిత వ్యాధులు, బీపీ, షుగర్, నాన్ కమ్యూనికేబుల్, టీహబ్, డయగ్నాస్టిక్ సెంటర్‌ల పనితీరుపై సమీక్షించి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు ప్రత్యేకమైన వైద్యం అందించాలని సూచించారు. వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చే శాంపిల్స్ ఫలితాలను ఎప్పటికప్పుడు ఆయా ప్రాథమిక కేంద్రాలకు పంపించాలన్నారు. నవజాత శిశువుల సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రీయ బాలస్వస్త్ (ఆర్‌బీఎస్‌కే) కార్యక్రమంలో అంగన్‌వాడీ స్కూల్ పిల్లలకు, ప్రైమరీస్కూల్ పిల్లలకు కంటికి సంబంధించిన వ్యాధులను, వినికిడి లోపం ఉన్న, మానసికంతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్యం అందించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాప్తి తీవ్రంగా ఉంటుందని వైద్యులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే నిర్వహించాలన్నారు. ఈ సమీక్షలో ఆస్పత్రి సూపరిండెంట్ శ్రీనివాసరావు, ఆర్‌ఎంవోలు జగదీష్, డాక్టర్ అయేషా బేగం, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సారంగం, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్ రావు, కేవీ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్, సబ్‌యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, సీపీ అనిల్, డీఈఐ మేనేజర్ విఘ్నేష్, టీహబ్ మేనేజర్ అనూరాధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద రైతుల నిరసన


మహమూద్‌పట్నం సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చెరువులోకి వరద నీరు రాకుండా నిర్మిస్తున్నారని ఆరోపణ

కేసముద్రం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహమూద్‌పట్నం సమీపంలో నిర్మిస్తున్న నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే వద్ద ఆ గ్రామానికి చెందిన రైతులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎగువ ప్రాంతంలోని వరద నీరు చెరువులోకి ప్రవహించేందుకు హైవేకు సరైన కల్వర్టులు నిర్మించడంలేదని ఆరోపించారు. వెంటనే వరద నీరు నిల్వకుండా నేరుగా చెరువులోకి ప్రవహించే విధంగా రోడ్డుకు కల్వర్టులను నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న సైట్ ఇన్‌చార్జ్ శ్రీరామ్ కల్వర్టులను నిర్మాణం చేయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మిట్టగడుపుల యాకూబ్, తొగరి నవీన్, బద్దుల వెంకటమల్లు, ఏశబోయిన శ్రీనివాస్, పోలు నర్సయ్య, శ్రీనివాస్, శివాజి గణేష్, విజయ్, అశోక్, సుభాష్, అనిల్ పాల్గొన్నారు.

రేషన్‌షాపులో దొడ్డు బియ్యం పంపిణీ


చిన్ననాగారం రేషన్‌షాపులో పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని చూపుతున్న లబ్ధిదారుడు యాకయ్య

ఇనుగుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో ఇందుకు భిన్నంగా దొడ్డు బియ్యం సరఫరా చేసిన ఉదంతం చిన్ననాగారంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామంలోని రేషన్‌షాపులో లబ్ధిదారులకు పంపిణీ చేసిన కొన్ని బస్తాల్లోపైన సన్నబియ్యం, లోపల దొడ్డు బియ్యం ఉన్నాయి. గ్రామానికి చెందిన లబ్ధిదారుడు బొలగాని యాకన్న బియ్యం తీసుకొని రేషన్ బస్తాలోంచి తానువెంట తెచ్చుకున్న ప్లాస్టిక్ బస్తాలోకి బియ్యాన్ని నింపుకున్నాడు. అయితే బస్తాలో పైభాగంలో సన్నబియ్యం ఉండగా లోపల దొడ్డు బియ్యం ఉన్నట్లు గుర్తించాడు. ఇదేమని రేషన్‌డీలరును ప్రశ్నించగా తనకు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరఫరా చేసిన బస్తాలనే పంపిణీ చేశానని సమాధానం ఇచ్చినట్లు లబ్ధిదారుడు తెలిపారు. ఇదిలా ఉండగా మరో బస్తాలో సైతం ఇదే విధంగా దొడ్డు బియ్యం వచ్చినట్లు లబ్ధిదారుడు తెలిపారు. దీనికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలి


మానుకోట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఫారెస్టు అధికారులు

నెహ్రూసెంటర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించుకోవాలని మహబూబాబాద్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ జ్యోత్స్నాదేవి కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫారెస్టు శాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని నందనవనం నుంచి మదర్‌థెరిస్సా సెంటర్ వరకు గురువారం బైక్‌ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని చెప్పారు. మానుకోట అర్బన్ పార్కులో ప్లాస్టిక్‌లను నివారించి ఫ్రీజోన్‌గా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు వెంకన్న, నాగరాజు, సురేష్, నవీన్, కొమ్మాలు, మంగరావు, చంద్రయ్య, గౌస్ పాల్గొన్నారు.

త్యాగ భావమే పరమావధిగా..



- బక్రీద్ పర్వదినానికి సర్వం సన్నద్ధం
- రేపే ఈద్-ఉల్-జుహా
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు

7




సీఆర్ఐ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్, మేనేజర్, షాపు నిర్వాహకులు

అందుబాటు ధరలో సీఆర్ఐ నాణ్యమైన పంపులు

సీఆర్ఐ జోనల్ మేనేజర్ మధుసూదన్

రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరలో ప్రజలకు నాణ్యమైన సీఆర్ఐ పంపు సెట్‌లను అందిస్తున్నామని జోనల్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. గురువారం కేయూ క్రాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య ఏజెన్సీ, సీఆర్ఐ పంప్ షోరూమ్‌ను జోనల్ మేనేజర్ మధుసూదన్, బ్రాంచ్ మేనేజర్ కీర్తి శ్రీనువాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇద్దరు మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకు పంపు సెట్‌లను అందించి వారి ఆదరాభిమానాలు పొందడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. మన్నికతో ఉన్న సీఆర్ఐ పంపుసెట్లు వాడటం వలన విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షాపు యజమానులు కర్ర సురేందర్‌రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

సరస్వతి నదికి హారతి



మహదేవపూర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరి వద్ద గురువారం సాయంత్రం సరస్వతి హారతి అర్చకులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం మొత్తం సరస్వతి నదికి హారతి ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. 12 రోజుల పాటు పుష్కరాలు అయిపోయినా ఆది పుష్కరాలు అయిపోయాయని మధ్య పుష్కరాలు ఏడాది మొత్తం ఉంటాయని అర్చకులు తెలిపారు. ఈ ఏడాది చివరి 12 రోజులకు అంత్య పుష్కరాలు జరుగుతాయని అందుకే చివరి వరకు ఈ ఏడాది మొత్తం అధికారుల ఆదేశాల మేరకు ఇవ్వడం జరుగుతుందని అర్చకులు తెలిపారు.

ఎంబీఏ విద్యార్థి ఆత్మహత్య

● ఉప్పల్‌లో ఘటన ● లింగాలఘణపురంలో విషాదం



సాయిరాం(ఫైల్)

లింగాలఘణపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన సోమ సాయిరాం(23) ఎంబీఏ చదువుతున్న విద్యార్థి మేడ్చల్ జిల్లా ఉప్పల్‌లో గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గీతకార్మికుడు సోమ వెంకటేష్-యాకమ్మ దంపతులకు ముగ్గురు కుమారులుండగా పెద్ద కుమారుడు సాయిరాం రామాంతపూర్‌లోని ఆరోరా కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. ఈక్రమంలో వారం క్రితం వేసవి సెలవుల నేపథ్యంలో స్వగ్రామం లింగాలఘణపురంనకు వచ్చిన సాయిరాం గురువారం తండ్రి వద్ద ఫీజు నిమిత్తం రూ.20వేలు వెంట తీసుకుని తన స్నేహితుడు బోయిని గణేశ్‌తో కలిసి బైక్ తిరిగి ఉప్పల్‌కు వెళ్లాడు. అక్కడ అద్దెఇంటికి చేరుకున్న ఇద్దరు స్నేహితులు రూమ్‌ను శుభ్రం చేసుకున్నారు. అనంతరం స్నేహితుడు గణేశ్ పైఅంతస్తులోని మిగతా స్నేహితులను కలిసేందుకు వెళ్లి తిరిగి కిందకు వచ్చే సరికి గదిలో సాయిరాం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు. మృతుడి తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఎంబీఏ విద్యార్థి సాయిరాం మృతితో లింగాలఘణపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సందడిగా రెవెన్యూ సదస్సులు

మూడోరోజు సదస్సులకు భారీ సంఖ్యలో రైతుల హాజరు ● పెద్దఎత్తున దరఖాస్తుల దాఖలు



దామెర మండలం ల్యాదెల్లలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి

హనుమకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులు మూడో రోజు గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాలో సందడిగా సాగాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ భూములకు సంబంధించిన సమస్యలను పేర్కొంటూ దరఖాస్తులను సమర్పించారు. తహసీల్దార్ల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు వీటిని స్వీకరించి అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో రికార్డు చేశాయి. హనుమకొండ జిల్లాలోని 13 మండలాల్లోని 13 రెవెన్యూ గ్రామాల్లో గురువారం 2,090 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ మూడురోజుల్లో సదస్సుల్లో దాఖలైన మొత్తం దరఖాస్తుల సంఖ్య 4,717కు చేరుకున్నది. కాగా, వరంగల్ జిల్లాలో 13 మండలాలకు గాను పన్నెండింటిలో 24 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి.

హనుమకొండ జిల్లాలో..

మూడో రోజు గురువారం భీమదేవరపల్లి మండలంలో గట్లకానిపర్తి, ధర్మసాగర్ మండలంలో ముప్పారం, ఎల్కతుర్తి మండలంలో వీరనారాయణపురం, హనుమకొండ మండలంలో లష్కర్ సింగారం, ఐనవోలు మండలంలో పంథిని, కమలాపూర్ మండలంలో అంబాల, వేలేరు మండలంలో సోడషపల్లి, కాజీపేట మండలంలో కాజీపేట, హసన్‌పర్తి మండలంలో ముచ్చర్ల, దామెర మండలంలో ల్యాదెల్ల, ఆత్మకూరు మండలంలో పెద్దాపూర్. పరకాల మండలంలో నాగారం, శాయంపేట మండలంలో నేరేడుపల్లి రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలో కూడా మూడోరోజు 24 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రశాంతంగా జరిగాయి. రాయపర్తి మండలంలో కేశవాపూర్, కొలన్‌పల్లి, పర్వతగిరి మండలంలో రోళ్లకల్, గోపనపల్లి, ఖిలా వరంగల్ మండలంలో రంగశాయిపేట, మామునూరు, వరంగల్ మండలంలో ఏనుమాముల, సంగెం మండలంలో కాపులకనపర్తి, పల్లారుగూడ, చెన్నారావుపేట మండలంలో లింగగిరి, కోనాపురం, దుగ్గొండి మండలంలో రేకనపల్లి, తొగర్రాయి, నర్సంపేట మండలంలో లక్నెపల్లి, మహేశ్వరం, మహిర, నల్లబెల్లి మండలంలో నారక్కపేట, రంగాపూర్, గీసుగొండ మండలంలో ధర్మారం, అనంతారం, నెక్కొండ మండలంలో సూరిపల్లి, చిన్నకోర్పోలు, ఖానాపురం మండలంలో ఐనపల్లి రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి.

నేడు సదస్సులు

హనుమకొండ జిల్లాలో నాలుగో రోజు శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరగనున్న గ్రామాలు.. భీమదేవరపల్లి మండలంలో కొత్తకొండ, ధర్మసాగర్ మండలంలో క్యాతంపల్లి, ఎల్కతుర్తి మండలంలోని పెంచికల్‌పేట, హనుమకొండ మండలంలో పలివేల్పుల, ఐనవోలు మండలంలో వెంకటాపూర్, కమలాపూర్ మండలంలో గుండేడు, వేలేరు మండలంలో పీచర, కాజీపేట మండలంలో మడికొండ, హసన్‌పర్తి మండలంలో చింతగట్టు, దామెర మండలంలో కోగిల్వాయి, ఆత్మకూరు మండలంలో చౌళ్లపల్లి, పరకాల మండలంలో పైడిపెల్లి, శాయంపేట మండలంలో కాట్రపల్లి.

● వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండలంలో గట్టికల్, ఊకల్, పర్వతగిరి మండలంలో అన్నారం షరీఫ్, ఖిలా వరంగల్ మండలంలో స్థంభంపల్లి, గాడెపల్లి, వరంగల్ మండలంలో ఏనుమాముల, సంగెం మండలంలో రామచంద్రాపూర్, పల్లారుగూడ, చెన్నారావుపేట మండలంలో అమీనాబాద్, ఎల్లాయగూడెం, దుగ్గొండి మండలంలో నాచినపల్లి, పొనకల్, నర్సంపేట మండలంలో నర్సంపేట, ముగ్దుంపురం, నల్లబెల్లి మండలంలో గోవిందాపూర్, రేలకుంట, గీసుగొండ మండలంలో వంచనగిరి, ఊకల్ హవేలీ, నెక్కొండ మండలంలో ముదిగొండ, తోపనపల్లి, ఖానాపూర్ మండలంలో డబీర్‌పేట, మంగళవారిపేట గ్రామాల్లో సదస్సులు జరుగుతాయి.

మనస్థాపంతో గృహిణి ఆత్మహత్య



బచ్చు లక్ష్మి (ఫైల్)

ఎల్కతుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన భర్త ప్రవర్తన మారక పోవడంతో మనస్థాపానికి గురైన గృహిణి బచ్చు లక్ష్మి (48) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై అకినేపల్లి ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూరారం గ్రామానికి చెందిన బచ్చు రామారావు-లక్ష్మీ దంపతులకు ఒక కుమారుడు, ఒక కమార్తె ఉన్నారు. ఐదేళ్ల కిందట రామారావు ఇల్లు కట్టగా అయిన అప్పును తీర్చడానికి తనకున్న 4 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మి అప్పు తీర్చారు. అప్పటి నుంచి రామారావు హనుమకొండలోని ఓ పెట్రోల్ పంపులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైయ్యాడు. దీనికి తోడు అప్పులు పెరిగాయి. భర్త ప్రవర్తనలో మార్పు రాదని లక్ష్మీ మనోవేదనకు గురైంది. ట్రాక్టర్ పనికోసం ఇంటికి తెచ్చి పెట్టుకున్న డిజీల్‌ను బుధవారం రాత్రి ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. బయట నిద్రపోతున్న భర్త రామారావుతో పాటు బంధువులు మంటలు ఆర్పి ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు రోహిత్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. కాజీపేట ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. రైల్వే క్వార్టర్స్ సమీపంలోని రామాలయం గుడి వద్ద బుధవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 45 - 50 ఏళ్లు ఉంటాయి. ఎత్తు 5.6 కోలముఖం, ఛామనఛాయ రంగు, బార్డర్‌గీతల షర్ట్, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మెడలో తెలుపు రంగు చైన్ ధరించి ఉన్నాడు. ఎడమ చేతికి గాయమై తెలుపు పట్టీ ఉంది. ఆనవాళ్ల బట్టి చూస్తే అనారోగ్యంతో మృతిచెందినట్లు భావిస్తున్నామని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరచామని ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు చెప్పారు.

రేపటి నుంచి దాదర్ వీక్లీ స్పెషల్ రైలు రద్దు

కాజీపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి రేచ్నిరోడ్ వద్ద జరుగుతున్న ఇంటర్‌లాకింగ్ పనులు దృష్ట్యా ఈ నెల 7 నుంచి 29 వరకు నడిచే కాజీపేట - దాదర్ వీక్లీ స్పెషల్ రైలు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 29 తర్వాత ఈ రైలు యథావిధిగా నడుస్తుందని రైల్వే అధికారులు చెప్పారు.

'నవ దంపతులకు ప్రధాని ఆశీర్వాదం

సంతోషం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు


Smt. Maddela Suguna Ji,
Congratulations on the wedding of Shiva Kumar with Lalitha.
May their marriage be blessed with constant joy, good health and success.
With Blessings,
(Narendra Modi)

బయ్యారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ బయ్యారంకు చెందిన ఓ నవదంపతులను నిండు నూరేళ్లు ఆయూరారోగ్యాలతో.. సంతోషాలతో జీవించాలని దీవిస్తూ ఆశీర్వదించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన మద్దెల సుగుణ-శోభన్ బాబు (లేట్) దంపతుల కుమారుడు శివకుమార్ వివాహం ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల సారమ్మ-సోమలింగం (లేట్) దంపతుల కుమార్తె లలితతో గతనెల మే 23న బయ్యారంలో జరిగింది. అయితే అంతకుముందు వివాహ వేడుకలో భాగంగా తన కుమారుడి వివాహానికి ఆహ్వానిస్తూ ఏప్రిల్ 20వ తేదిన శివకుమార్ తల్లి సుగుణ ప్రధాని నరేంద్ర మోదీకి శుభలేఖ పోస్ట్ చేసింది. దీంతో నవదంపతులను మోదీ ఆశీర్వదిస్తూ సుగుణ పేరు మీద గత నెల 30న ప్రధాని కార్యాలయం నుంచి లేఖ పంపించగా.. ఆ లేఖ గురువారం బయ్యారంలో ఉంటున్న మద్దెల సుగుణ ఇంటికి చేరింది. దీంతో నవదంపతులతో పాటు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, తమ ఆహ్వానాన్ని స్వీకరించి మాలాంటి పేద కుటుంబ సభ్యులకు మోదీ ఆశీర్వాదం తెలపడం గొప్ప వరమని, ఇలాంటి మధురానుభూతి జీవితాంతం గుర్తుండిపోతుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



శ్రావణ్ (ఫైల్)

గీసుగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన చాపర్తి శ్రావణ్(40) అప్పుల బాధతో ఇంట్లో ఉరి వేసుకొని గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రావణ్ భార్య పిల్లలతో వరంగల్ కొత్తవాడలో ఉంటూ హమాలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో కొంత అప్పుచేశాడు. అయితే గురువారం గ్రామంలో చిట్టి డబ్బులు కట్టడానికి వచ్చాడు. అయితే అతని వద్ద చిట్టి డబ్బులు లేక మానసిక ఆవేదనతో మనుగొండలోని ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, మృతుని భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

ఖమ్మంలో రోడ్డు ప్రమాదం

- తండ్రీ కొడుకుల మృతి
- డోర్నకల్ మండలం దుబ్బతండాలో విషాదఛాయలు



లారీ బైక్‌ను ఢీకొట్టడంతో మృతిచెందిన బాల్య



అజ్మీర బాల్య (ఫైల్)



సాయికుమార్ (ఫైల్)

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దుబ్బతండాకు చెందిన తండ్రీ, కొడుకులు మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బతండాకు చెందిన అజ్మీర బాల్య (50)-భారతి దంపతులు వ్యవసాయ చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఏకైక కుమారుడు సాయికుమార్ (17) ఖమ్మంలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో బాల్య తన కుమారుడు సాయికుమార్‌తో కలిసి గురువారం ఉదయం తమ ద్విచక్రవాహనంపై ఖమ్మంకు వెళ్లారు. కళాశాలకు వెళ్తున్న క్రమంలో ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వారి ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో బాల్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన సాయికుమార్‌ను 108 ద్వారా అస్పత్రికి తరలించగా, అతడిని పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలో మృతి చెందినట్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న బాల్య భార్య భారతి కన్నీరుమున్నీరుగా విలపించింది. కుటుంబంలో భర్త, కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భారతి ఒంటరిగా మిగిలిపోయింది.

కాగా, బాల్య బీఆర్ఎస్ పార్టీలో నాయకుడిగా పనిచేయడంతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు, స్థానికులు, స్నేహితులు పెద్దసంఖ్యలో ఖమ్మంకు బయలుదేరి వెళ్లారు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ సైతం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో బాల్య, సాయికుమార్ మృతదేహాల వద్ద కంటతడి పెట్టారు. పోస్టుమార్టం అనంతరం బాల్య, సాయికుమార్ మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించడంతో దుబ్బతండాకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్య, సాయికుమార్ మృతదేహాలవద్ద నివాళ్లర్పించారు. అనంతరం బాల్య, సాయికుమార్‌ల అంతిమయాత్రలో భారీగా ప్రజలు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి చెందడంతో విషాదం నెలకొంది.

లిఫ్ట్ గుంతలో పడి బాలుడి మృతి



సాత్విక్(ఫైల్)

ధర్మసాగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ధర్మసాగర్ మండలకేంద్రానికి చెందిన సుంకనపల్లి సాత్విక్ (12) అనే బాలుడు లిఫ్ట్ గుంతలో పడి బుధవారం రాత్రి మృతి చెందినట్టు ఏఎస్సై పోచయ్య గురువారం తెలిపారు. సాత్విక్ తన స్నేహితులతో కలిసి సమీపంలో ఇదే గ్రామానికి చెందిన గంకిడి శ్రీనివాస్‌రెడ్డి నూతనంగా నిర్మాణం చేపట్టిన బిల్డింగ్ వద్దకు ఆడుకునేందుకు వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో స్నేహితులతో కలిసి బిల్డింగ్ పైన ఆడుతున్నక్రమంలో సాత్విక్ కాలు జారి లిఫ్ట్ గుంత నీటిలో పడి మునిగిపోయాడు. తోటి స్నేహితులు కొద్దిగంటల సమయం తర్వాత కుటుంబ సభ్యులకు సమాచారం తెలుపడంతో కుటుంబసభ్యులు లిఫ్ట్ గుంతలో పడిపోయిన సాత్విక్‌ను నీటిలో నుంచి బయటికి తీసి చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి సాత్విక్ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతి చెందిన బాలుడు నగరంలో 7వ తరగతి చదువుతున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ జట్ల ఎంపిక



అండర్-19 అంతర్ జిల్లాల స్థాయి క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపికైన వరంగల్ జిల్లా జట్టుతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రికెటర్లను వెలుగులోకి తెచ్చేందుకు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 6వ తేదీ నుంచి భూపాలపల్లి, ములుగు, జనగాం, జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న అంతర్ జిల్లాల స్థాయి అండర్-19 బాలుర ఉమ్మడి వరంగల్ జిల్లాల క్రికెట్ లీగ్ జట్ల తుది జాబితాను క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ గురువారం ప్రకటించారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5తేదీల్లో కరుణాపురం సమీపంలోని వంగపల్లి క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 బాలుర క్రికెట్ లీగ్ పోటీల్లో హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు మహబూబాబాద్, జనగామ జిల్లాల జట్ల మధ్య ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలో సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 6జట్లను 6జిల్లాలుగా విభజించి అంతర్ జిల్లాల స్థాయి క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. అంతర్ జిల్లాల స్థాయిలో సుమారు 15రోజుల పాటు ఆరు జిల్లాల మధ్య ఒక్కో జట్టుకు 5మ్యాచ్‌లు నిర్వహించి, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-19 హెచ్‌సీఏ క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణగౌడ్, ఉపాధ్యక్షులు తోట రాము, సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, ఈసీ మెంబర్ వినయ్, కోచ్‌లు ఎండీ. అఫ్జల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం కేసులో 9మందిపై కేసు

వరంగల్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ స్టేషన్ రోడ్డు ప్రాంతంలో గల ఆంధ్రప్రదేశ్ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్‌లో నకిలీ బంగారం పెట్టి రూ.43లక్షలు కాజేసిన తొమ్మిది మందిపై ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. ఇంతేజార్‌గంజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ షుకూర్ కేసు దర్యాప్తు అనంతరం వరంగల్‌లోని ఆంధ్రప్రదేశ్ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్‌లో పనిచేస్తున్న బ్రాంచ్ మేనేజర్‌తో పాటు మరో ఐదుగురు బ్యాంకు సిబ్బంది, ఖాతాలు తెరిచిన ముగ్గురు కస్టమర్లు మొత్తం 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..

బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ కె.శివకృష్ణ, ఇతర ఐదుగురు బ్యాంకు సిబ్బంది ముగ్గురు కస్టమర్ల పేర్ల మీద ఖాతాలు తెరిచారు. ఇందులో వరంగల్ శివనగర్‌కు చెందిన సి.శ్రవణ్‌కుమార్ పేరు మీద మార్చి 17, 2025న 145 గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ.8లక్షలు, గుంటూరుకు చెందిన లక్ష్మీశిరీష పేరు మీద ఏప్రిల్ 22, 2025న 764 గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ.18.50 లక్షలు, హంటర్‌రోడ్డుకు చెందిన టి.రజిత పేరు మీద ఏప్రిల్ 24, 2025న 278గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ.17లక్షలు మొత్తం రూ.43లక్షల 50వేలు తీసుకున్నారు. వీరు ముగ్గురు బ్యాంకులో డబ్బులు తీసుకున్నప్పటి నుంచి వడ్డీ చెల్లించకపోవడంతో హైదరాబాద్ నుంచి బ్యాంకు సిబ్బంది ఆడిట్ చేయడానికి మే 23, 2025న వరంగల్‌లోని ఆంధ్రప్రదేశ్ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు వచ్చి ఈ బ్యాంకులో ఉన్న మొత్తం బంగారాన్ని పరీక్ష చేయగా ఈముగ్గురు కస్టమర్లు పెట్టిన బంగారం నకిలీదని తేలిందన్నారు. దీంతో బ్యాంకు హెడ్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.చంద్రప్రకాశ్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో నకిలీ బంగారం పెట్టిన ముగ్గురు కస్టమర్లపై ఫిర్యాదు చేశారు. సీఐ షుకూర్ దర్యాప్తు చేసిన అనంతరం ఏ1గా బ్యాంకు బ్యాంచ్ మేనేజర్ కె.శివకృష్ణ, ఐదుగురు సిబ్బంది ఏ2 కె.రాముశర్మ, ఏ3 జీవిత్‌కుమార్, ఏ4 జి.బ్రహ్మాచారి, ఏ5 పి.రాజమౌళి, ఏ6 వి.కరుణాకర్‌లు అదేవిధంగా ముగ్గురు కస్టమర్లు ఏ7 సి.శ్రవణ్‌కుమార్, ఏ8 లక్ష్మీశిరీష, ఏ9 టి.రజితలపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆఫర్‌లో తక్కువ ధరకు బైక్‌ల పేరిట మోసం

మట్టెవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పండుగ ఆఫర్ పేరిట తక్కువ రేటుకే కొత్త ద్విచక్ర వాహనాలు షోరూమ్ వాళ్ల విక్రయిస్తున్నట్లు ఒక్కొక్కరికి దగ్గర రూ.70వేలు వసూలు చేసి చేసిన ఓ వ్యక్తిపై బాధితులు గురువారం మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే... హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి వరంగల్ కొత్తవాడలో నివాసం ఉంటున్నాడు. దసరా పండుగ ఆఫర్ పేరుతో షోరూమ్ వాళ్ల రూ.1,10,000 విలువ చేసే ద్విచక్ర వాహనాలను రూ.70వేలకు విక్రయిస్తున్నట్లు చెప్పిన వ్యక్తి సుమారు 34 మంది వద్ద రూ.70వేలు తీసుకొని వాహనాన్ని అందజేశారు. సదరు వ్యక్తి ఫైనాన్స్ కంపెనీకి పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించకుండా వాహనాన్ని కొన్న వారికి డాక్యుమెంట్లు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేశాడు. దీంతో ఫైనాన్స్ కంపెనీ వారు వాహనాలను జప్తు చేసేందుకు రావడంతో బాధితులు ఒక్కసారిగా షాక్‌కు అయ్యారు. వీరందరికి కూడా ఎంజీఎంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ ద్వారా ఈ కొత్తవాడ ప్రాంతానికి చెందిన వ్యక్తి పరిచయం అయ్యాడని, స్కీంలో తక్కువ ధరకే ద్విచక్ర వాహనాలు షోరూం వాళ్ల విక్రయిస్తున్నారని చెప్పడంతో కొనుగోలు చేసినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. మోసపోయిన బాధితులు ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందిగా తెలిసింది. రూ.70వేలు చెల్లించిన తరువాత ఫైనాన్స్ కంపెనీ వారు ద్విచక్ర వాహనాలను ఎందుకు జప్తు చేస్తున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు.



వేసవి క్రీడా శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

క్రీడలతో విద్య, ఉద్యోగావకాశాలు

» హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య » ముగిసిన క్రీడా శిక్షణ శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా స్పోర్ట్స్ కోటాలో విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్ తోపాటు నగరంలో వివిధ ప్రాంతాల్లో మే 1న ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు గురువారం ముగి శాయి. హనుమకొండ జేఎన్ఎస్‌లోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు వేడుకలకు కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఏడాది కంటే ఈ ఏడు రెండింతలుగా విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. శిక్షణ శిబిరాలు విజయవంతం కావడానికి విద్యార్థుల తల్లిదండ్రులు, డీఎస్ఏ సిబ్బంది కీలక భూమిక పోషించారని కొనియా డారు. క్రీడల వల్ల శరీర దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను మైదానాలకు పంపించి వారికి నచ్చిన క్రీడల్లో తర్ఫీదు ఇప్పించాలన్నారు. క్రీడల వల్ల క్రమశిక్షణతో పాటు పలు విషయాలపట్ల అవ గాహన కలుగుతుందన్నారు. ఇటీవల జేఎన్ఎస్‌లో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో జిల్లాకు పెద్దఎత్తున పతకాలు వచ్చాయని కలెక్టర్ గుర్తు చేశారు. అలాగే డీఎస్ఏ ఆధ్వర్యంలోని జిమ్నాస్టిక్స్ హాల్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్, మరమ్మతుల కోసం రూ.1కోటి30లక్షల నిధులు కేటాయించామన్నారు.

విశిష్ట అతిథి, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు పాల్గొనడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం గొప్పదన్నారు. జిల్లా యువజన క్రీడల అధికారి జి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. 36 రోజులుగా జేఎన్ఎస్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో సుమారు 22 క్రీడాంశాల్లో శిబిరాలు నిర్వహించామన్నారు. 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న బాలబాలికలకు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో దాదాపు 2వేల మందికి పైబడి పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా జేఎన్ఎస్‌లో పలు క్రీడల్లో శిక్షణ పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడారు. అనంతరం వివిధ క్రీడాం శాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు కలెక్టర్ ప్రావీణ్య మెడల్స్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా డీవైఎస్‌వో రఘు, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసి యేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శ్యాంప్ర సాద్, నెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు లిల్లీ ఫోరెన్స్, వాలీబాల్ అసోసియేషన్ బాధ్యులు మర్కాల యాదిరెడ్డి, అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ బాధ్యులు కరీం, డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమాన్, ఎం.డి. అఫ్జల్, పి.రమేష్, బి.జీవన్‌గౌడ్, ఆర్.రమేష్, పి.వెంకటేశ్వర్లు, బి.విష్ణు, దేవిక, శంకర్, రాజు, ప్రభుదాస్‌తోపాటు వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

త్యాగభావమే పరమావధిగా..

'ఉన్నదొక్కటే జీవితం...
పంచాల్సింది ఒక్కటే... నిరంతర ప్రేమ..
ఎవరిపై ఎవరికీ ఎలాంటి ఆధిక్యత లేదు
ఒకరి హక్కును మరొకరు దోచుకోవడం శిక్షార్హం.. పగ, ప్రతీకారం, వడ్డీ, లావాదేవీలు రద్దయ్యాయి'

ఇవీ.. దాదాపు పదిహేను వందల ఏళ్ల కిం దట మహ్మద్ ప్రవక్త చివరి హజ్ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలు. ఆయన ప్రసంగ పాఠం ఆద్యంతం మానవ హక్కులకు పెద్దపీట వేసిం ది. స్వేచ్ఛాయుత వాతావరణంలో సామాజిక ప్రగతిని ఉత్తమ జీవన ప్రమాణాలను ఉద్బోధించారు. హజ్ వంటి ఆధ్యాత్మిక యాత్ర లో సంప్రదాయాలు, ధార్మిక కట్టుబాట్ల గురించి కాకుండా మానవ హక్కులను ప్రస్తావించడం ప్రపంచ మానవ హక్కుల ప్రకటనగా పేర్కొనవచ్చు.

» రేపే ఈద్-ఉల్-జుహా
» బక్రీద్ పర్వదినానికి సర్వం సన్నద్ధం
» ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు



మహబూబాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇస్లాం ధర్మంలోని ఐదు మౌలిక సూత్రాలను ముస్లింలు విధిగా పాటిస్తారు. మొదటిది సృష్టికర్త ఒక్కడేనన్న విశ్వాసం, రెండోది నమాజ్, మూడోది ఉపవాసం (రోజా), నాలుగోది జకాత్ (ఆర్థిక విధానం), ఐదోది హజ్ (కాబా సందర్శన యాత్ర) ఇందులో ఏ ఒక్కదాన్ని పాటిం చకున్నా అల్లాహ్‌పై విశ్వాసం పరిపూర్ణం కాదని నమ్ముతారు. మానవుడు దైవ విశ్వాసి అనడానికి రుజువులు ఇవేనని చెబుతారు. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లింపై హజ్ విధిగా నిర్ణయించబడింది. స్థోమత కలిగిన వారు జీవిత కాలంలో ఒక్కసారైనా ఈ యాత్ర చేయ డం తప్పనిసరి. ఈ ఆరాధన ముస్లింల క్యాలెండర్‌లోని జిల్ హజ్జ్ మాసంలో 10వ తేదీన సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో జరుగుతుంది. ఆ రోజే అంటే ఈ సారి జూన్ 7న (రేపు) ప్రపంచంలోని ముస్లింలంతా పండుగ జరుపుకుంటారు. దీన్నే 'ఈద్- ఉల్-జుహా' లేక 'బక్రీద్' లేక 'ఈదె ఖుర్బాన్' అని రకరకాలుగా వ్యవహరిస్తారు.

బక్రీద్ పండుగ నేపథ్యం ..



హజ్రత్ ఇబ్రహీమ్‌కు లేక లేక ఒక కొడుకు హజ్రత్ ఇస్మాయిల్ జన్మిస్తాడు. ఒక రోజు హజ్రత్ ఇబ్రహీమ్ తన కొడుకును జిబాహ్(వధ) చేస్తున్నట్లు కలగం టాడు. ఆ కల తనకు దైవాజ్ఞగా భావించి కల సారాంశాన్ని తన కొడుకు ఇస్మాయిల్‌కు చెబుతాడు. అదే అల్లాహ్ ఆజ్ఞ అయినప్పుడు తాను సిద్ధమేనని ఇస్మాయిల్ అంగీకరిస్తాడు. హజ్రత్ ఇబ్రహీం పుత్రవాత్సల్యాన్ని జయించి కన్న కొడుకును బలివ్వడానికి సిద్ధమవుతాడు. ఆ సమయంలోనే అల్లాహ్ ఇబ్రాహీమ్‌లోని ప్రేమ బలిని గుర్తించి అక్కడ కొడుకు స్థానంలో గొర్రెపోతు ప్రత్యక్షమై జిబాహ్ (బలి) అవుతుంది. ఇలా అల్లాహ్ పరీక్షలో ఇబ్రాహీమ్ నెగ్గుతారు. ఆ క్రమంలోనే ఖుర్బానీగా పేర్కొనే జంతు బలిదానం తెరపైకి వచ్చింది.

ఆత్మీయాదరణకు బక్రీద్ పండుగ

త్యాగబోధన పండుగ అయిన బక్రీద్ సకల మానవ లోకానికి సౌభ్రాతృత్వాన్ని, జాతి, మత, బీద, గొప్ప భేదాలను మాన్పి ప్రేమానురాగాలతో సంబంధాలను మరింత పెంపొందించేందుకు సందేశాన్ని ఇస్తుందని ప్రతీతి. ముస్లింలు ఈ పండుగ ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి ఉదయం 8 నుంచి 9 గంటలలోపు వివిధ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులకనుగుణంగా నిర్దేశిత సమయానికి ఈద్గా మైదానాలకు చేరుకుంటారు. అంతా కలిసి భేదభావం లేకుండా సహపంక్తిలో నిలబడి ప్రార్థన చేస్తారు. పెద్ద ఇమాంను అనుసరిస్తూ ఖుద్బా నమాజ్‌లో పాల్గొంటారు.

ఖుర్బానీ

మనిషిలోని త్యాగ భావాన్ని సజీవం, సుచేతనంగా ఉంచడానికి ప్రతీ సంవత్సరం బక్రీద్ పండుగ నాడు ముస్లింలు ఖుర్బానీ ఇస్తారు. అల్లాహ్ ఇచ్చిన ఆదేశాల అంతర్యం ఇదేనని కోట్లాది మంది ముస్లింలు ఈ పండుగ నాడు జంతు బలిదానం చేస్తారు. త్యాగభావానికి తార్కాణమైన బక్రీద్ మత సామరస్యానికి ఎంతో దోహదపడుతుంది. ఈ సందర్భంగా ఖుర్బానీ, ఆధ్యాత్మిక, సామాజిక, కుటుంబ బాధ్యతలు, త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్ర (హజ్)ల ప్రాధాన్యం గురించి ఈద్గాల్లో ఇమామ్‌లు వివరిస్తారు.

ఖుర్బానీతో అల్లాహ్‌పై విశ్వాసం

ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు పూర్తి చేసుకున్న ముస్లింలు తమ గృహాలకు చేరుకుని ఖుర్బానీ ద్వారా అల్లాహ్‌పై విశ్వాసాన్ని వ్యక్తపరుస్తూ జంతు బలిదానాలు చేస్తారు. ఆ మాంసాన్ని మూడింట ఒక వంతు పేదలకు పంపిణీ చేయాలి. మిగిలిన రెండు భాగాల్లో ఓ భాగం తన సొంతానికి, మరో భాగం పొరుగువారు, బంధుమిత్రులకు ఇవ్వాలి. ఖుర్బానీ మాంసాన్ని ముస్లిమేతరులకు కూడా పంపిణీ చేయవచ్చని తద్వారా మానవులంతా ఒక్కటేనన్న భావన కల్గించినట్లవుతుందని ముస్లిం పెద్దలు చెబుతారు.


జంతు బలిదానం వెనుక పరీక్ష

ఖుర్బానీ అంటే జంతుబలిదానం అని చెబుతారు. అన్ని ప్రేమల కన్నా దైవ ప్రేమ గొప్పదని, దీని కోసం అన్నింటినీ త్యాగం చేయాలని అల్లాహ్ ఆజ్ఞాపించాడని ముస్లిం పెద్దలు చెబుతారు. ఆ ఆజ్ఞ తొలిసారిగా పరీక్షకు నిలిచిన సందర్భంగా ఖుర్బానీ తెరపైకి వచ్చిందని పేర్కొంటారు. దీన్ని ఉదహరించి విశ్లేషించే కథనాన్ని ఉటంకిస్తూ ఏటేటా బక్రీద్ రోజు జంతు బలిదానాలు నిర్వహిస్తున్నారు.

హజ్ చేయాలని సంకల్పిస్తే..

హజ్ చేయాలని సంకల్పించిన వ్యక్తి దీక్ష బూనాలి. మనసులో ఎలాంటి దురుద్దేశం లేకుండా, కీర్తి ప్రఖ్యాతలపై కోరిక ఉండకూడదని భావన. హజ్ ప్రయాణ ఖర్చులకు ఉపయోగించే డబ్బు ధర్మ సంపాదనై ఉండాలి. వడ్డీ, జూదం, లాటరీ, లంచం, మోసపూరితమైన వ్యాపారం, దొంగతనం తదితర అక్రమంగా సంపాదించిన డబ్బుతో హజ్ యాత్ర చేయడం మహా నేరమని ముస్లిం మత బోధకులు చెబుతున్నారు. ముస్లింలకు మక్కా తర్వాత మదీనా ఎంతో గొప్ప పుణ్యక్షేత్రం. హజ్ యాత్రలో మక్కాకు వెళ్లిన ప్రతిఒక్కరూ ఆ తర్వాత మదీనాకు వెళ్తుంటారు.

ఆధ్యాత్మిక యాత్ర హజ్



త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్రను హజ్ అంటారు. బక్రీద్‌ను పురస్కరించుకుని సౌదీ అరేబియా దేశంలోని మక్కాలో ఉండే కాబా గృహాన్ని దర్శించే సంకల్పంతో లక్షలాది ముస్లింలు హజ్ యాత్రను చేస్తారు. ప్రపంచం నలు మూలల నుంచి ముస్లింలు మక్కా నగరానికి తరలి వెళ్తారు. దైవప్రవక్త ఆదేశాన్ని శిరసావహించేలా హజ్ శిక్షణ ఇస్తుందని ముస్లింలు విశ్వసిస్తారు. ఇస్లామియా జీవన వ్యవస్థకు మూలస్తంభాలైన నమాజ్ (ప్రార్థన), రోజా (ఉపవాసం), జకాత్ (దానం)లతో పాటు హజ్ కూడా తప్పనిసరని ముస్లింలకు దైవాదేశం. అందువల్లే జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని ముస్లింలు లక్ష్యంగా ఎంచుకుంటారు.

అభివృద్ధికి ఆమడ దూరం

» విలీన గ్రామాల్లో సమస్యల తిష్ట
» వేధిస్తున్న సిబ్బంది కొరత
» ఉపాధి కోల్పోయిన కూలీలు
» కన్నీరు పెడుతున్న పల్లెప్రకృతి వనాలు
» పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


నాగుర్లపల్లెలో నిరుపయోగంగా మారిన వాటర్ ట్యాంకు

నర్సంపేట టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట పట్టణాన్ని కార్పొరేషన్‌గా అభివృద్ధి చేసేందుకు సమీపంలోని ఎనిమిది గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలో విలీనం చేశారు. విలీనం చేసిన గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లేక అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. మౌలిక వసతులు కరువై సమస్యలు తిష్ట వేశాయి. రోడ్లు, సైడ్ కాల్వలు లేని వీధులు, తాగు, సాగునీరు, ఉపాధి పనులు వంటి సమస్యలతో ప్రజలు, రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి మాట దేవుడెరుగు, పన్నులు పెరిగి మోయలేని భారం పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులెవరిని కదిలించినా గ్రామ పంచాయతీ పాలనలో తమ బతుకులు బాగున్నాయి.. మునిసిపాలిటీలో కలిసినప్పటి నుంచి తమను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. నర్సంపేట మునిసిపాలిటీ నుంచి కార్పొరేషన్ వైపు అడుగులు వేసేందుకు పట్టణానికి సమీపంలో ఉన్న నాగుర్లపల్లె, మాధన్నపేట, పర్శనాయక్ తండా, ముత్తోజీపేట, మహేశ్వరం, రాములునాయక్ తండా, మగ్దుంపురం, రాజపల్లె గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలో విలీనం చేశారు.


నిధుల లేమితో నాగుర్లపల్లెలో నిలిచిపోయిన ప్రభుత్వ భవన నిర్మాణం

సమస్యలతో సతమతం

మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో సమస్యలు తిష్ట వేశాయి. పంచాయతీ పాలనలో ఉన్న కార్యదర్శులకు గ్రామాలపై అజమాయిషి ఉండగా, మునిసిపాలిటీలో విలీనంతో డ్రైనేజీ, తాగునీరు సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. మిషన్ భగీరథ కాంట్రాక్టర్ పైపులైన్ పనులను అర్ధాంతరంగా ముగించడంతో తాగునీటి కోసం ప్రజలు తండ్లాడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

మునిసిపాలిటీలో విలీనం కావడంతో గ్రామాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రం చేయలేకపోవడంతో ప్రజలు దోమలు, మురుగు వాసనతో నానా ఇబ్బందులు పడుతున్నారు. మునిసిపాలిటీ నుంచి నెలలో ఎప్పుడు వచ్చి డ్రైనేజీలు శుభ్రం చేస్తారో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాగునీటి సరఫరా చేసే పనిలో ఒక్కరే విధులు నిర్వర్తించడంతో సక్రమంగా జరగడం లేదు. దీంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. అలాగే మునిసిపాలిటీలో విలీనం కావడంతో కూలీలకు పనులు లేకుండా పోయాయి. గతంలో ఈజీఎస్ కింద పనులు చేసి వచ్చే డబ్బులతో కుటుంబాలను వెళ్లదీసుకునేవారు. మునిసిపాలిటీలో విలీనంతో ఉపాధిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

పల్లెప్రకృతి వనాలకు సంరక్షణ కరువు

విలీనానికి ముందు ఈజీఎస్ కింద వర్కర్లు పల్లె ప్రకృతి వనాల సంరక్షణ బాధ్యతలు చేపట్టేవారు. మునిసిపాలిటీలో విలీనంతో ఈజీఎస్ ఎత్తి వేయడంతో వేతనాలు రావని తెలిసిపోయి వర్కర్లు పనుల నుంచి వైదొలిగారు. దీంతో పల్లెప్రకృతి వనాలకు సంరక్షణ లేకుండా పోయింది.



సంరక్షణ కరువైన పల్లె ప్రకృతి వనం

అధికారుల నిర్లక్ష్యం

విలీన గ్రామాల్లో అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఏర్పాట్లను చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ప్రజలకు తిప్పల తప్పడం లేదు. మునిసిపాలిటీలో విలీనమైతే అభివృద్ధి జరుగుతుందనుకుంటే పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విలీన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


విలీన గ్రామంలో మూలన పడ్డ దోమల నివారణ పిచికారీ యంత్రం

జోసా అభ్యర్థుల కోసం ఓపెన్ హౌస్



వరంగల్ నిట్ పరిపాలనా భవనం

హనుమకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జాయింట్ సీట్ అలోకేషన్ ఆథారిటీ (జోసా) ద్వారా ప్రవేశాన్ని కోరుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు వరంగల్ ఎన్ఐటీలోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఈనెల 9న ఓపెన్‌హౌస్‌ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ ఓపెన్ హౌస్‌లో పాల్గొన్నవారికి విద్యావేత్తలు, ప్రస్తుత విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ, శాఖల ఎంపిక, సీటు కేటాయింపు, క్యాంపస్ సౌకర్యాలపై సందేహాలను నివృత్తి చేసుకోవడానికి అకాశం ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని నిట్ వరంగల్ అధికారిక యూట్యూబ్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఓపెన్‌హౌస్‌కు ప్రత్యక్షంగా హాజరుకాలేని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ చానెల్ ద్వారా వీక్షించవచ్చు. నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి, డీన్లు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థి ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రసంగిస్తారు. జోసా కౌన్సెలింగ్ ప్రక్రియలో అభ్యర్థులకు మార్గనిర్దేశం చేస్తారు. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరై ప్రయోజనం పొందాలని నిట్ అధికారులు కోరారు.

నిట్‌ను సందర్శించిన బీవోజీ చైర్మన్

» డైరెక్టర్, డీన్లతో సమావేశం
» నిట్ పనితీరుపై మోహన్‌రెడ్డి సమీక్ష


మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి


హనుమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి గురువారం నిట్‌ను మొదటిసారిగా సం దర్శించారు. డాక్టర్ రెడ్డి సయింట్ సంస్థ వ్యవస్థాపకుడు, ప్రస్తుతం ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ కూడా. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ రెడ్డికి నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి ఘన స్వా గతం పలికారు. నిట్‌లో విద్యాబోధన, ఇతర కార్యకలాపాలపై డాక్టర్ రెడ్డి డైరెక్టర్, డీన్లతో సమగ్రంగా చర్చించారు. అనంతరం అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో అధ్యాపకులు, పరిపాలనాధికారులతో సమావేశమై విద్యా ప్రావీణ్యం, ఆవిష్కరణలు, పరిశ్రమ-సంస్థ భాగస్వామ్యాలపై చర్చించారు. పరిశోధన గ్రాంట్ల పెంపు, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడం, సిలబస్‌ను తాజా సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నవీకరించడం, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా సంస్థ పరిధిని విస్తరించాల్సిన అవసరం తదితర అంశాలపై తన అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

పోలీసు ఫైల్స్!

పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ

• నాలుగు రకాల సేవలకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ యాప్
• అన్ని ఠాణాల్లో ఏర్పాటైన క్యూఆర్ కోడ్ పోస్టర్లు
• ఫిర్యాదు ఎవరిదో తెలియకుండా రూపకల్పన
• పోలీసుల వ్యవహార శైలిపై సర్కారు నజర్

కృష్ణకాలనీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏదేని సమస్యతో మీరు ఠాణాకు వెళ్తున్నారా..? అయితే అక్కడ పోలీసుల తీరు ఎలా ఉంది..? మీకు ఎదురయ్యే సమస్యలపై వారు ఎలా స్పందిస్తున్నారు. ఏదైనా ఇబ్బందులు పెడుతున్నారా..? లేక ఇంకేమైనా డిమాండ్ చేస్తున్నారా..? ఇలా పోలీసుల ప్రవర్తన ఎలా ఉందనే విషయాన్ని ఉన్నతాధికారులకు ప్రజలు చెప్పొచ్చు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోలీసుల సేవలపై ప్రజల అభిప్రాయం.. మేం మీ అభిప్రాయానికి విలువ ఇస్తాం.. అనే స్లోగన్‌తో సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు సర్కారు శ్రీకారం చుట్టింది. ఇందుకు గాను క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకరాగా.. ఇప్పటికే అన్ని ఠాణాల్లో ఈ క్యూ ఆర్ కోడ్‌లను ఆయా ఠాణాల పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు.



సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్ పోస్టర్

నాలుగు రకాల సేవలపై నజర్

పోలీసు అధికారుల అందిస్తున్న సేవలపై ప్రభుత్వం దృష్టి సారించిందనే చెప్పుకొచ్చు. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూలేని విధంగా వినూత్న కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఇందులో ప్రధానంగా పోలీసులు అందిస్తున్న నాలుగురకాల సేవలపై వారి తీరు ఎలా ఉందనే విషయాన్ని తెలిపేందుకు అవకాశాన్ని కల్పించారు. వీటిలో ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, ఈ-చలాన్, పాస్‌పోర్టు ధృవీకరణ, ఇతర అంశాలు అంటూ నాలుగు సేవలపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 పోలీస్‌స్టేషన్‌ల నుంచి ఇప్పటి వరకు 150 పోస్టులు వచ్చినట్లు తెలిసింది. వీటిలో దాదాపు అధికారుల పనితీరులో వారు అందిస్తున్న సేవల్లో అభినందనీయంగానే వచ్చినట్లు తెలిసింది.

నేరుగా డీజీపీ ఆఫీసుకే..

పోలీసుల తీరుపై ఫిర్యాదు చేస్తే మళ్లీ ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయనే భయానికి సైతం ఆస్కారం లేదు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పోస్టు చేసిన వివరాలన్ని నేరుగా డీజీపీ కార్యాలయానికి వెళ్తోంది. ఆ ఫిర్యాదులను డీజీపీ కార్యాలయ ఉన్నతాధికారులు మినహా మరెవరూ చూసే ఆస్కారం లేదని పోలీసు ఉన్నతాధికారులు చెప్పుకొచ్చారు. ఫలితంగా ఎవరు ఎలాంటి అభిప్రాయాన్ని చెప్పారనేది బయటకు తెలిసే అవకాశం ఉండదు. నిర్భయంగా ప్రజలకు ఎదురయ్యే సమస్యలతోపాటు పోలీసులు అందిస్తున్న విశిష్ట సేవలను సైతం పోస్టు చేయొచ్చు.

యాప్‌లోంచి క్యూఆర్ స్కాన్

క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలంటే తొలుత సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి సిటిజన్ ఫీడ్ బ్యాక్ పేరుతో ఉన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ యాప్‌లోంచి ప్రస్తుతం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. దీంతో మొదటగా లాంగ్వేజ్ ఆప్షన్ తదుపరి పేరు, పురుష/స్త్రీ, సెల్ నెంబర్, మెయిల్ ఐడీ, పోలీస్‌స్టేషన్ పేరుతో సహా ఇతర వివరాలు నమోదు చేసి అప్లోడ్ చేయాలి. కాగా, ఇప్పటికే అన్ని ఠాణాల్లో దాదాపు క్యూఆర్ కోడ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, ఠాణా ఆవరణల్లో ఈ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు.

పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట

పోలీస్ శాఖలో సేవలపై చాలా మందిలో అన్యత భావన నెలకొంటుంది. ఠాణాకు వెళ్తే సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పాటు సమస్యలు మరింత జఠిలమవుతాయనే అపవాదు ఉంది. ఈ నేపథ్యంలో పోలీసుల పనితీరు, వారిలోని పారదర్శకతను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు, సలహాలు, సూచనలతో మార్పులు, చేర్పులకు ఆస్కారం ఉండనుంది. పోలీసుల పనితీరులో మార్పు తీసుకొ చ్చే ఆలోచనలో భాగంగా సర్కారు వినూత్నంగా ఆలోచింపజేయడంపై హర్షం వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ క్యూఆర్ కోడ్ ఎలా వినియోగించాలి, ఎలాంటి ఎలా ఫిర్యాదు చేయాలనే విషయాలపై అవగాహనలు కల్పిస్తే ప్రభుత్వ ఆలోచన ఫలిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎవరైనా తమ అభిప్రాయాలను తెలుపొచ్చు

కిరణ్‌ఖరే, జిల్లా ఎస్పీ భూపాలపల్లి



ప్రజలెవరైనా పోలీసుల పనితీరుపై తమ అభిప్రాయాలు నిర్భయంగా తెలియజేయవచ్చు. పోలీసుల నుంచి ఎదురయ్యే సమస్యలు గానీ, వారు అందిస్తున్న విశిష్ట సేవలపై గానీ ఏదైనా తెలియపర్చవచ్చు. ఇప్పటివరకైతే ఒకటి రెండు మినహా మిగిలినవన్నీ సంతృప్తికరమైన పోస్టులు వచ్చాయి. ప్రభుత్వం ఇలాంటి ఆలోచనతో పోలీసులు మరింత సమర్థవంతంగా పని చేసి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందే అవకాశం ఏర్పడింది. ఈ కార్యక్రమంపై జిల్లాలో త్వరలో విస్తృతంగా ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపడుతాం.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కోర్టు అవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు విరివిరిగా నాటి పర్యావరణాన్నిపరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, ఏవో క్రాంతికుమార్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ, సీనియర్ న్యాయవాదులు మేక సురేష్, కొంపెల్లి వెంకటయ్య, మామిడాల సత్యనారాయణ, శ్రీనివాస్, తండ కృష్ణ, అరెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

తొర్రూరు, (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తొర్రూరు కోర్టు జడ్జి ధీరజ్‌కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి ఇబ్బందులు కలగకుండా నీరు, విద్యుత్ పొదుపు చేయాలని, జూట్ బ్యాగులు మాత్రమే వాడాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో బుచ్చయ్య మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, దారం కుమారస్వామి తదితరులు ఉన్నారు.



తొర్రూరు కోర్టు ఆవరణలో మొక్కను నాటుతున్న జడ్జి ధీరజ్‌కుమార్

ప్రశాంతంగా బక్రీద్‌ను జరుపుకోవాలి

● అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారితో కలిసి ముస్లీం, హిందు పెద్దలతో కలిసి శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో మాట్లాడుతూ.. గోమాతను పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి వివాదాలకు చొటివ్వకుండ బక్రీద్ పర్వదినాన్ని జరుపుకోవాలని సూచించారు. పోలీస్‌శాఖ విస్తృతంగా తనిఖీలు చేపడుతుందని, చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, గోవులను రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగను పురస్కరించుకుని మాంసపు విక్రయాల వద్ద మునిసిపల్ సిబ్బంది పారిశుద్ధ్య మెరుగుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ తిరుపతిరావు, అధికారులు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, కృష్ణవేణి, హరిప్రసాద్, సాయిచరణ్, శాంతకుమార్, నరేష్‌రెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్‌వత్సల్ టొప్పో

సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణం చేపట్టాలి

జిల్లా కేంద్రంలో నిర్మించే జంక్షన్ అభివృద్ధి పనులను వాహనదారులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతంగా ఉండేలా నిర్మించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో నిర్మాణాలు జరిగే ముత్యాలమ్మగుడి సెంటర్, మూడుకొట్ల సెంటర్, కురవి రోడ్‌లోని ప్రాంతాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జంక్షన్ అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతోచేపట్టి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. మునిసిపల్ డీఈ ఉపేందర్ పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

పెద్దవంగర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కొరిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గురువారం స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని కొరిపెల్లి గ్రామానికి చెందిన ఎడ్ల చిరంజీవి-చందన దంపతులకు విజయ్, నాని ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన ఎడ్ల విజయ్ (18) ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పూర్తి చేశాడు. గత కొద్ది రోజుల అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తీవ్ర మనస్తాపంతో విజయ్ ఇంట్లో ఎవరూలేని సమయంలో తాడుతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. స్థానికులు, చుట్టుపక్కల వారు వెళ్లి చూసేపరికి అప్పటికే మృతి చెంది విగతజీవిగా ఉన్నాడు. మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై ఎస్సై క్రాంతికిరణ్ వివరణ కోరగా ఘటనకు సంబంధించిన విషయం మా దృష్టికి వచ్చిందని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ఇద్దరు వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. వీఎస్.లక్ష్మీపురం గ్రామానికి చెందిన దిడ్డి గట్టయ్య-సోమలక్ష్మి దంపతుల కుమార్తె శ్రావణిని అదే గ్రామానికి చెందిన పచ్చిపాల నరేష్‌కు ఇచ్చి కొన్నేళ్ల క్రితం వివాహం జరిపించారు. వివాహ సమయంలో తనకున్న నాలుగేకరాల భూమిని ఇద్దరు కుమార్తెలకు చెరో రెండెకరాల చొప్పున పంచి ఇచ్చారు. భూమి ఇస్తున్న క్రమంలో ఒక్కొక్క కుమార్తె తల్లిదండ్రులకు రూ. 2 లక్షల చొప్పున ఇవ్వాలని తీర్మాణం చేశారు. ఆ భూమిని నరేష్ తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని శ్రావణి తండ్రి గట్టయ్యను పలుమార్లు అడిగుతూ వచ్చేవాడు. రూ.2 లక్షలు ఇస్తేనే భూమిని రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పడంతో కోపోద్రిక్తుడైన పచ్చిపాల నరేష్, అతని సోదరుడు లింగయ్యతో కలిసి బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో మామ గట్టయ్యపై గొడ్డలితో తలపై మోదారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన గట్టయ్యను చికిత్స నిమిత్తం జిల్లా అస్పత్రికి తరలించి అక్కడ్నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. కుమార్తె శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై హత్యయత్నం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అత్యాచారం కేసులో వ్యక్తికి జైలు

నర్సింహులపేట, జూన్5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి జిల్లా కోర్టు జైలు శిక్షతో పాటు 1500 జరిమానా విధించినట్లు ఎస్సై మాలోతు సురేష్ గురువారం తెలిపారు. 2018లో 3ఏండ్ల బాలికపై షేక్ మహబూబ్ అనే వ్యక్తిఅత్యాచారానికి పాల్పడగా బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హజరుపరిచారు.కోర్టు కానిస్టేబుల్ వెంకన్న సాక్షులను కోర్టులో హజరు పర్చడంతో నేరం రుజువైంది.మహబుబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ ముద్దాయికి 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 1500 జరిమానా విధించినట్లు ఎస్సై చెప్పారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం



తహసీల్దార్ వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకుడు శంతన్‌రామరాజు

మహబూబాబాద్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు శంతన్‌రామరాజు అన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని శనిగపురంలో భూభారతి సదస్సులో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో ప్రభుత్వ భూమితోపాటు నిరుపేదల భూములు అన్యాక్రాంతం అయ్యాయని వాపోయారు. దశాబ్దాలుగా పట్టేదారుగా ఉన్న రైతు పట్టా పాస్‌పుస్తకాలు లేకుండ అధికారులు అనేక ఇబ్బందులకు గురిచేశారని చెప్పారు. భూభారతితో గ్రామంలోని భూ సమస్యలన్నింటికి పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ చంద్రరాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంశెట్టి ఉప్పలయ్య, హరిసింగ్‌నాయక్, బొమ్మ రాజు, కుమారస్వామి, దయాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థానికంగా ఉండని సిబ్బందిపై చర్యలు

● డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్‌రెడ్డి

తొర్రూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే సిబ్బంది స్థానికంగా ఉండి విధులు నిర్వర్తించాలని, లేనిచో వారిపై చర్యలు తప్పవని తొర్రూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్ రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు క్లస్టర్ పరిధిలోని ఆస్పత్రులను తనిఖీ నిర్వహించి సిబ్బందితో మాట్లాడారు. బుధవారం రాత్రి తొర్రూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక వ్యక్తి తీవ్ర గాయాలతో రాగా, సిబ్బంది లేకపోవడం, డాక్టర్‌లు ఉండకపోవడంతో పోలీసులకు, అధికారులకు తెలపగా తనిఖీలు నిర్వహించామన్నారు. 24 గంటల ఆస్పత్రుల్లో సిబ్బంది స్థానికంగా ఉండి విధులు నిర్వర్తించాలని, లేనిచో వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో విద్యాసాగర్, వనాకర్ రెడ్డి, వైద్యులు తదితరులు ఉన్నారు.

రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం వర్షాకాలం రుతుపవనాలు పదిరోజులు ముందుగానే రాష్ట్రంలోకి ప్రవేశించాయని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు ప్రభుత్వం వద్ద ఎలాంటి ప్రణాళిక లేకపోవడం మరోవైపు నకిలీ విత్తనాలతో రైతులు ఆందోళన చెందుతుంటే ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అర్హులైన రైతులందరికి 75 శాతం సబ్సిడీ ద్వార విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని సూపరిండెంట్ మాల్యాకు వినతిపత్రం అందించారు. గుజ్జు దేవేందర్, నందగిరి వెంకటేశ్వర్లు, బండారి ఐలయ్య, మోకాళ్ల మురళీకృష్ణ, బాబన్న, నాగేశ్వర్‌రావు, సక్రు, యాకన్న, సోమిరెడ్డి, వెంకన్న, లక్ష్మయ్య, వెంకటనారాయణ, భగవాన్, బాబురావు, భద్రయ్య, చారీ హరీష్, బోనగిరి మధు, నాగరాజు, పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

● కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ



మొక్కలు నాటుతున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నేడు ప్రపంచం యావత్తు కాలుష్య కోరల్లో చిక్కుకొని ఉందని, ఈ కాలుష్యాన్ని నివారించటం ప్రపంచలోని ప్రతీ ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భూమి, నీరు కూడా కాలుష్యం భారిన పడుతున్నారని, ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిర్మూలించడంలో ప్రభుత్వాలు కఠిన నిబంధనలు అమలుచేయాలన్నారు. అసోసియేషన్ ముఖ్య సలహాదారు షైస శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించినప్పుడు మాత్రమే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు.ప్రభుత్వాలు సహజ సంపదను కొల్లగొడుతూనే మరో వైపు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. పట్టాబి లక్ష్మయ్య, విష్ణువర్ధన్, రవీందర్, హట్యానాయక్, పెద్ది వెంకన్న, భావ్‌సింగ్, వెంకటేశ్వర్లు, దేవేందర్‌రెడ్డి, బుర్ల ప్రభాకర్, రామకృష్ణారావు, పరమేశ్వర్, వెంకన్న, శ్రీహరి, నరసింహరావు, సత్యం, వెంకన్న, వీరేందర్, శ్రీనివాసులు, రఫీ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల కోసం కార్మికుల సమ్మె

● కమిషనర్ హామీతో సమ్మె విరమణ

మహబూబాబాద్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికులకు గత ఐదు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలంటూ ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు మాట్లాడుతూ.. మునిసిపల్ కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో అన్ని మునిసిపాలిటీల్లో ప్రతినెల కార్మికులకు వేతనాలు చెల్లిస్తుంటే మహబూబాబాద్ మునిసిపాలిటీల్లో మాత్రం ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి నెల 5వ తేదీలోపు కార్మికులకు వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింప చేయాలని డిమాండ్ చే శారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ రాజేష్ సమ్మె చేసేందుకు వచ్చిన కార్మికులతో వారం రోజుల్లోగా మీ సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో వారు సమ్మె విరమించారు.ఈ కార్యక్రమంలో నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, రేషపల్లి నవీన్, శ్రీనివాస్, మధుసూదన్, తప్పెట్ల శ్రీకాంత్, పుష్పరాజ్, వెంకటరమణ, ఎల్లయ్య, వీరన్న, జగన్, వెంగళ్‌రావు, పద్మ, సుగుణ, ధనమ్మ, అర్చన, ఎలేందర్ పాల్గొన్నారు.

‘అక్రమ కేసులను ఎత్తివేయాలి’



జిల్లా కోర్టుకు హాజరైన సీపీఐ, సీపీఎం నేతలు

మహబూబాబాద్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జిల్లా కేంద్రంలోని సాలార్‌తండ వద్ద గిరిజనుల భూములను లాక్కుంటే వారికి మద్దతుగా నిలిచిన సీపీఎం, సీపీఐ నాయకులపై అక్రమ కేసులు బనాయించారని, వాటిని వెంటనే కొట్టివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్‌లు డిమాండ్ చేశారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా కోర్టుకు హాజరై బయటకు వచ్చిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం కోసం గిరిజనుల భూములను లాక్కుంటుంటే వారిపక్షాన నిలబడిన సీపీఐ, సీపీఎం గిరిజననేతలపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. వాటిని తక్షణమే కొట్టివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, అంగోతు శివాజీ, సుందర్, బాలాజీ, మంగ్యా, వెంకన్న పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు శ్రీనివాస్ మృతి

● నివాళులు అర్పించిన నాయకులు, కార్యకర్తలు

కురవి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, గీతపనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్ (57) మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కురవి మండలం రాజోలుకు చెందిన పోగుల శ్రీనివాస్ మూడు దశాబ్దాలుగా సీపీఐ అనుబంధ సంఘాల్లో కీలకభూమిక నిర్వహిస్తున్నారు. మరిపెడ మండల కార్యదర్శిగా, దంతాలపల్లి, చిన్నగూడూరు పార్టీ నిర్మాణ బాధ్యుడిగా వ్యవహరిస్తున్నాడు. గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేశాడు. ఆయన మృతి వార్త తెలుసుకున్న సీపీఐ జిల్లా నాయకులు నల్లు సుధాకర్‌రెడ్డి, బి.అజయ్ సారథిరెడ్డిలు పోగుల శ్రీనివాస్ మృతదేహంపై అరుణ పతకాన్ని ఉంచి నివాళులు అర్పించారు. సీపీఐ నాయకులు కర్నం రాజన్న, బుడమ వెంకన్న, కన్నె వెంకన్న, పెరుగుకుమార్, సీహెచ్.వెంకన్న, నవీన్, వరిపెల్లి వెంకన్నలు, ఐజేయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్.శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తోట లాలయ్యలు శ్రీనివాస్ మృతదేహం వద్ద నివాళ్లర్పించారు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య సూరంభ, కుమారుడు గోపి, కుమార్తె ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కురవి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండ వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వీరబాబు అన్నారు. కురవిలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కురవి, బలపాల పీహెచ్‌సీ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సంబంధిత వ్యాధుల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించాలని, గత సంవత్సరం మాదిరిగా డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, భగీరథ నీటిని క్లోరినేషన్ చేయాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్లు విరాజిత, స్రవంతి, హెచ్ఈవో గౌసుద్దీన్, రవికుమార్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాలి

పెద్దవంగర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : బడీడు పిల్లలను బడుల్లో చేర్పించి విద్య అవశ్యకతను వివరించాలని ఎంపీడీవో బి వేణుమాదవ్, ఎంఈవో బుధారపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యలయంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలు, ఐసీడీఎస్, అమ్మ ఆదర్శ కమిటీలతో పాటు కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు జరిగే బడిబాట కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు విద్యా సంవత్సరం ప్రారంభంలో బడిబాట కార్యక్రమం చేపడుతుందని, రానున్న విద్యా సంవత్సరంలో డ్రాపవుట్స్ లేకుండా ప్రభుత్వ పాఠశాలలో బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు హెచ్‌ఎంలతో పాటు అధికారులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులను కల్పించాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఏకరూప దుస్తులను అందేలా చూడాలని కోరారు. హెచ్‌ఎంలు విజయ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శోభ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో బి.వేణుమాధవ్



అంబేద్కర్ చౌరస్తాలో వెలగని హైమాస్ట్ దీపాలు

అంధకారంలో ప్రధాన కూడలి

● పట్టించుకోని ప్రత్యేకాధికారులు

పెద్దవంగర, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పెద్దవంగర మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా అధికారుల నిర్లక్ష్యంతో అంధకారం అలముకుంది. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఉన్న హైమాస్ దీపాలు వెలగకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడలి వద్ద లైట్లు వెలగకపోవడంతో షాపుల వద్ద ఏర్పాటు చేసిన లైట్ల వెలుగులోనే వాహనచోదకులు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ దీపాలు మరమ్మతు చేయాలని కోరినా ప్రత్యేకాధికారుల పాలనలో వీటిని పట్టించుకునేవారు కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైమాస్ట్ దీపాల మరమ్మతులు చేయాలని లేదా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తొర్రూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మునిసిపాలిటీలో నేడు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ శాంతి కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని మునిసిపాలిటీ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పల్లకీలో సాయిబాబా

మరిపెడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాయిబాబా దేవాలయంలో షిర్డీ సాయిబాబాను గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయంలో నూతనంగా నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించి, గణపతి, వాస్తు పూజలను చేసి హోమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్న వితరణ చేశారు. అనంతరం షిర్డీ సాయిబాబాను ఆలయం చుట్టు 3 సార్లు పల్లకీలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మందిర వ్యవస్థాపకుడు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బొగతను సందర్శించిన కేంద్ర అధికారి

వాజేడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ నయాగర జలపాతమైన బొగతను కేంద్ర మంత్రిత్వ శాఖ ఐఅండ్‌బీ జాయింట్ సెక్రటరీ ప్రీధుల్ కుమార్ గురువారం సందర్శించారు. జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించిన ఆయన బొగత అందాలకు ఫిదా అయ్యారు. బొగత జలపాతంకు సందబందించిన విశేషాలను స్థానిక అధి కారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో పాల్గొని బ్రోచర్‌ను అవిష్కరించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ ఆర్ఐ కుమారస్వామి, ఎఫ్ఎస్‌వో నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

తొర్రూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తొర్రూరు కోర్టు జడ్జి ధీరజ్ కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి ఇబ్బందులు కలగకుండా నీరు, విద్యుత్ పొదుపు చేయాలని, జూట్ బ్యాగులు మాత్రమే వాడాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో బుచ్చయ్య మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, దారం కుమారస్వామి ఉన్నారు.

‘ఆత్మీయ భరోసా’ మంజూరు చేయాలి



ఆందోళన చేస్తున్న ఏఐపీకేఎంఎస్ నేతలు

మహబూబాబాద్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రూ.12 వేలు ఇచ్చి ఆదుకుంటామన్న హామీ ఏమైందని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) జిల్లా కార్యదర్శి ముంజంపల్లి వీరన్న డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా వ్యవసాయ కూలీలను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించాలని చెప్పారు. ఉమగాని సత్యం, జానికిరాములు, బషీర్, లక్ష్మయ్య, సుందర్, బాలాజీ, లక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.